ప్రజలకు ఉమాశంకరుడి దీవెనలుండాలి

- ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి
- బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్
- ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): గరళాన్ని తన కంఠంలో దాచుకొని ముల్లోకాలను కాపాడుతున్న ఆ ఉమాశంకరుడి కరుణా కటాక్షాలు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఉండాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కోరుకున్నారు. సుఖశాంతులతో ఉండేలా ప్రజలందరినీ దీవించాలని ఆ మహాశివుడిని ఆయన ప్రార్థించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర మహాశివరాత్రి సందర్భంగా శివభక్తులు ఉపవాస దీక్షను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించడం హిందూ సంప్రదాయంలో ప్రత్యేకతను సంతరించుకున్నదని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా శివాలయాలు, భక్తుల శివనామస్మరణతో మారుమోగుతాయని తెలిపారు.

సొరంగం లోపల సహాయక చర్యలు చేపడుతున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

ఇంకా దొరకని ఆనవాళ్లు

- సొరంగంలో ప్రమాదం జరిగి నేటికి ఐదు రోజులు
- చిక్కుకున్న ఎనిమిది మంది కోసం విస్తృత గాలింపు చర్యలు
- బతికున్నారని నమ్మేందుకు ఇంకా దొరకని బాధితుల ఆనవాళ్లు
- టన్నెల్‌లో నత్తనడకన సాగుతున్న సహాయ చర్యలు
- ఇప్పటికిప్పుడు శిథిలాల తొలగింపూ అసాధ్యం: రెస్క్యూ టీమ్స్

సొరంగం లోపల అడ్డదిడ్డంగా పడిఉన్న శిథిలాలు, ఇతర సామగ్రి

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం, అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టు కంపెనీ నిర్దాక్షిణ్యంతో శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం పనుల్లో ఎనిమిది మంది ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సిన దుస్థితి తలెత్తింది. అత్యంత ప్రమాదకరమైన ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చేపట్టిన పనుల్లో జరిగిన ప్రమాదం తీవ్ర విషాదంగా మారింది. టన్నెల్ పైకప్పు కూలడంతో ఆ ప్రాంతంలో చిక్కుకున్న వారి ఆచూకీ ఐదు రోజులైనా దొరకలేదు. గాలింపు, సహాయ చర్యలు కొనసాగుతున్నా ఎలాంటి పురోగతి లేదు. కార్మికులు ప్రాణాలతో బయటపడుతారన్న ఆశలు రోజురోజుకు సన్నగిల్లుతున్నాయనే ఆవేదన వ్యక్తమవుతున్నది. టన్నెల్ లోపలికి వెళ్లివచ్చిన సహాయ బృందాలు చెప్తున్న వివరాల ప్రకారం చూస్తే ఎలాంటి ఆశలు కనిపించడం లేదని అధికారులు చెప్తున్నారు. బురద, నీరు, మట్టి, రాళ్లతో టన్నెల్ ఎక్కడికక్కడ పూడుకుపోవడం, శిథిలాల తరలింపునకే నెలల సమయం పట్టే అవకాశముందని వెల్లడిస్తుండడంతో పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు కార్మికుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన గురవుతున్నారు.

ప్రమాదం జరిగిందిలా!

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో 14వ కిలో మీటర్ పాయింట్ వద్ద శనివారం ఉదయం 8.20 గంటలకు ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా భారీగా నీరు, మట్టి, రాళ్లు వచ్చి టన్నెల్ బోర్ మిషన్‌పై పైకప్పు కూలింది. ఈ క్రమంలో టీబీఎం ముందు భాగంలో పనులు చేస్తున్న 8 మంది కార్మికులు అందులో చిక్కుకుపోయారు. 5 రోజులు గడిచినా ఇప్పటివరకు కార్మికుల అచూకీ, ఆనవాళ్లు లభించలేదు. టన్నెల్ ముందుభాగంలోనే కార్మికులు జీవించి ఉంటారనే ఆశలే తప్ప ఎక్కడ ఉన్నారనేది కచ్చితంగా తెలియని పరిస్థితి నెలకొంది. కార్మికులు బ్రతికే ఉన్నారని చెప్పేందుకు ఒక్క సంకేతం కూడా కనబడడంలేదని రెస్క్యూ బృందాల అధికారులు చెప్తున్నారు.

చీకటి సొరంగం.. అత్యంత దుర్భరం

టన్నెల్ 150 మీటర్ల మేరకు కూలిపోయినట్టు సహాయ బృందాల అధికారులు చెప్తున్నారు. టీబీఎం వెనుక భాగం కూడా శిథిలాల కింద పూడుకుపోయిందని, ముందుభాగం కూడా బురద, నీరు, మట్టి, రాళ్లతో పూర్తిగా పూడుకుపోయి ఉంటుందని తెలిపారు. టీబీఎం తోకభాగాన్ని దాటుకుని రెస్క్యూ బృందాలు 100 మీటర్ల దగ్గర వరకు చేరుకోగలిగినా, మరో 40 మీటర్లు ముందుకు పోలేని పరిస్థితి ఉందని చెప్పారు. కార్మికులున్న ప్రాంతమంతా శిథిలాలతో నిండి ఉంటుందని అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు శిథిలాల కింద కాకుండా టీబీఎంలో ఖాళీ ప్రదేశంలో చిక్కుకుని ఉన్నారని భావించినా, 5 రోజులుగా నీరు, ఆహారం లేకుండా జీవించడం కష్టమేనని రెస్క్యూ బృందాల అధికారులు వివరిస్తున్నారు. వెరసి కార్మికులు జీవించి ఉండాలనే ఆశ తప్ప, వారు సజీవంగా ఉన్నారనేందుకు ఒక్క ఆధారమూ, అవకాశమూ లేకుండా పోయిందని నిర్వేదం వ్యక్తంచేస్తున్నారు. రోజులు గడుస్తున్న కొద్దీ ఆశలన్నీ సన్నగిల్లుతున్నాయని అంటున్నారు.

ముందుకుసాగని సహాయ చర్యలు

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సర్కారు చేపట్టిన సహాయ చర్యలు ముందుకు సాగడం లేదు. ఎన్డీఆర్ఎఫ్, ఆర్మీ, నేవీ, ర్యాట్‌మైనర్స్, సింగరేణి తదితర రెస్క్యూ బృందాలు ఒకరి తర్వాత ఒకరు రావడం, సొరంగం లోపలి భీతావహ పరిస్థితులను చూసి నిస్సహాయంగా వెనుదిరగడమే కనిపిస్తున్నది. మంత్రులు, ఉన్నతాధికారులు హడావుడిగా రావడం, సొరంగంలోకి వెళ్లడం, బయటకు వచ్చి సమీక్షలు పెట్టడం, కార్మికులను రక్షించడానికి ప్రణాళికలను రూపొందిస్తున్నామని ప్రకటించడం పరిపాటిగా మారింది. కానీ ఒక్క అడుగు కూడా ఇప్పటికీ ముందుకు పడలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. బురద, నీరు ప్రతికూల పరిస్థితులు ఉన్నాయని చెబుతున్నారనే తప్ప వాటి నివారణకు చిత్తశుద్ధితో కృషి చేయడంలేదని వివరిస్తున్నారు. బురద, నీరు తొలగింపు, ధ్వంసమైన టీబీఎంను కట్ చేసి తొలగించే పనులు చాలా నిదానంగా కొనసాగుతున్నాయని వాపోతున్నారు. సహాయ చర్యల తీరు చూస్తుంటే ఈ ప్రక్రియ నెలల తరబడి కొనసాగేలా ఉందని కార్మికులే అంటున్నారు. ఈ నేపథ్యంలో లోపల చిక్కుకున్న కార్మికులపై ఆశలు రోజురోజుకూ అడుగంటిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

లోకం పోకడ



ఆశలు ఆవిరేనా!

మొదటిపేజీ తరువాయి...

కూలిన ప్రాంతం 200 మీటర్ల వరకు ఉంటుందని తెలిపారు.

మిషన్ తొలగింపే మెయిన్ టాస్క్

సొరంగంలో ప్రమాద స్థలానికి చేరుకోవాలంటే అడ్డుగా ఉన్న టీబీఎం కటింగ్, నీరు, బురద తొలగింపు కీలకంగా మారాయి. సొరంగం ఓపెన్ అయిన తర్వాత మళ్లీ కూలే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రమాదం జరిగినప్పుడు ఇద్దరు టీబీఎం మిషన్ ఆపరేటర్లు, ఇద్దరు ఇంజినీర్లు, నలుగురు సహాయకుల మీద సొరంగం పైకప్పు కూలిందని భావిస్తున్నారు. ఇప్పటివరకు 40 మీటర్లే యాక్సిడెంట్ జోన్‌గా భావించిన సిబ్బంది లోపలికి వెళ్లిన కొద్దీ సొరంగ మార్గం ఎంత క్లిష్టమైందో అర్థమవుతున్నదని చెప్తున్నారు.

వెళ్లి రావడానికి ఐదు గంటలు

సహాయ బృందాలు టన్నెల్ లోపలికి వెళ్లి బయటకు రావడానికి ఐదు గంటల సమయం పడుతున్నది. దీంతో 11 బృందాలను మోహరించారు. ఆ బృందాల్లో నుంచి కొందరిని ఏరికోరి పంపిస్తున్నారు. వారందరూ లోకోట్రైన్‌లో లోపలికి వెళ్లి పరిస్థితులను అంచనా వేసి బయటికి వస్తున్నారు. ఆ తర్వాత ఏం చేయాలనే దానిపై తర్జనభర్జనలు పడుతున్నారు. సొరంగం పూర్తిగా మూసుకుపోయి బురద నీటితో నిండి ఉందని గుర్తించారు. అక్కడి నుంచి ముందుకు వెళ్లి, లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడం ఎలా? అనేదానిపై సహాయ బృందాల టీమ్ లీడర్లు ఆలోచిస్తున్నారు.

దారిచూపిన ర్యాట్ మైనర్స్

సొరంగంలోకి చొచ్చుకెళ్లడంలో ర్యాట్ మైనర్స్ టీమ్ కీలకంగా వ్యవహరించింది. ఈ టీమ్‌లో 25 ఏండ్ల లోపు 12 మంది యువకులు ఉన్నారు. వీరంతా సాహసోపేతంగా సొరంగం లోపలికి దూరి దారి చూపించారు. టన్నెల్‌లో ప్రమాద స్థలానికి అతి చేరువలోకి వెళ్లారు. 14 కిలోమీటర్ల పరిధిలో పైకప్పు ఊడిపడడంతో పూర్తిగా దెబ్బతిన్న టన్నెల్ బోరింగ్ మిషన్ వద్దకు చేరుకుని, అక్కడి దృశ్యాలను చిత్రీకరించారు. ఉబికి వస్తున్న ఊటను... పేరుకుపోయిన బురదను లెక్కచేయకుండా సాహసోపేతంగా మిగతా బృందాలకు దారి చూపారు.

లోపల ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ మళ్లీ కూలే ప్రమాదం ఉంది. మా బృందం 11 మంది వెళ్లాం. మా వెనకాల ఎన్‌డీఆర్ఎఫ్ టీమ్ వచ్చింది. మేము వెళ్లినప్పుడు 22, 23 బ్లాకులు లూజ్‌గా ఉన్నాయని గుర్తించాం. వీటిని వెంటనే మళ్లీ ఫిక్స్ చేసి కిందికి జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాం. అక్కడ ఏ క్షణమైనా మట్టి కూలే ప్రమాదం ఉందని మేము తిరిగి వచ్చేశాం. మేము వెళ్లగలిగే చివరి ఏరియా వరకు వెళ్లాం. మాకు ఎవరూ కనిపించలేదు. మేము డెహ్రాడూన్, ఉత్తరకాశీ ప్రమాదంలో 41 మందిని కాపాడాం. కానీ ఇక్కడ ప్రమాదంలో ఏం చెప్పలేకపోతున్నాం. ఇక్కడి పరిస్థితులు వేరేలా ఉన్నాయి.

- ఫిరోజ్ ఖురేషీ, ర్యాట్ మైనర్స్ టీమ్ లీడర్, ఢిల్లీ

లోపలికి వెళ్లేందుకు దారి చేశాం

ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంలో టన్నెల్ బోరింగ్ మిషన్‌ను గుర్తించాం. వెనక భాగాన్ని మొత్తం కవర్ చేశాం. అక్కడున్న బురద ఇతర శిథిలాలను పక్కకు జరిపాం. లోపలికి వెళ్లడానికి దారిని ఏర్పాటు చేశాం. టీబీఎం కింద ఎవరైనా చిక్కుకున్నారా అని చూశాం. పైకప్పు ఊడిపడడంతో టీబీఎం మిషన్ ముందు భాగం మొత్తం పాడైపోయింది. దాని మీదే మట్టి కూలింది. కూలిన చోట నుంచి నీటి ధారలు వస్తున్నాయి. కన్వేయర్ బెల్ట్‌ను కూడా రిపేర్లు చేస్తున్నాం. మాతోపాటు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ టీమ్‌లు కూడా ఉన్నాయి.

- మున్నా ఖురేషీ, ర్యాట్ మైనర్స్ టీమ్, ఢిల్లీ

బాకీలు కట్టి బాటలేసిందే బీఆర్ఎస్

నాడు సవాళ్లను అధిగమించి.. 11.48 కి.మీ. పూర్తి చేసిన బీఆర్ఎస్

- ప్రత్యేక ప్రణాళికతో ప్రమాదాల్లేకుండా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు
- తగ్గిన యంత్ర సామర్థ్యం.. పెరిగిన సీపేజీ
- కాంట్రాక్టర్ సతాయించినా ప్రాజెక్టుపైనే శ్రద్ధ
- రెండు దఫాలుగా 200 కోట్ల అడ్వాన్స్ చెల్లింపు
- నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవ

బీఆర్ఎస్ హయాంలో చురుగ్గా సాగుతున్న ఎస్ఎల్‌బీసీ సొరంగపనులు (ఫైల్)

హైదరాబాద్, ఫిబ్రవరి26 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) ప్రాజెక్టును 2005లో ప్రారంభించి 60 నెలల్లో పూర్తిచేయాలని తొలుత లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రాజెక్టుకు సంబంధించి 43.93 కిలోమీటర్ల మేర సొరంగం తవ్వకం పనులను రెండు వైపుల నుంచి ప్రారంభించారు. తెలంగాణ ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత చేపట్టిన పనులతో కలిపి ఇప్పటివరకు 34.372 కి.మీ సొరంగం తవ్వకం పూర్తికాగా, ఇంకా 9.560 కిమీ మేర సొరంగాన్ని తవ్వాల్సి ఉన్నది. టీబీఎం టెక్నాలజీ, కాంట్రాక్ట్ ఏజెన్సీ సతాయింపులు.. క్షేత్రస్థాయిలోని సవాళ్లు పనుల జాప్యానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒక్క బీఆర్ఎస్ ప్రభుత్వ హయాలోనే 11.482 కిలోమీటర్ల మేర పనులు జరిగాయి. ఆనాడు కాంట్రాక్టు సంస్థ విద్యుత్తు బిల్లుల చెల్లింపు జాప్యంతో పనులకు అడ్డంకిగా మారింది. దీంతో నాటి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వమే విద్యుత్ బిల్లులు చెల్లించేలా ఏకంగా క్యాబినెట్‌లోనే తీర్మానం చేసి పనుల జాప్యానికి చెక్‌పెట్టారు. ఇలా క్షేత్రస్థాయిలో అనేక సవాళ్లను అధిగమించి బీఆర్ఎస్ ప్రభుత్వం పనులు చేసినా, అసలు పనులే చేయలేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించడంపై తెలంగాణవాదులు మండిపడుతున్నారు. కేవలం ప్రస్తుతం ప్రమాద ఘటన నుంచి బయటపడేందుకే మరో కుట్రకు తెరలేపే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పేరు కోసం హడావుడి చేసి పనులను ప్రారంభించి ఇప్పుడు గత సర్కారు వైఫల్యమంటూ ఆరోపణలు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు.

సవాళ్లను అధిగమించిన నాటి బీఆర్ఎస్ సర్కార్

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎస్ఎల్‌బీసీ సొరంగం తవ్వకం పనుల్లో అనేక సవాళ్లు ఎదురయ్యాయి. బీఆర్ఎస్ అధికారంలోకి రాకమునుపే అప్పటివరకూ చేసిన పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యం వల్ల కాంట్రాక్ట్ సంస్థ మొండికేసింది. ఈ సమయంలోనే బీఆర్ఎస్ అధికారంలోకి రాగా, ఇటు ప్రభుత్వం, ఆనాడు ప్రతిపక్ష నేతగా ఉన్న జానారెడ్డి కాంట్రాక్టు సంస్థతో చర్చించారు. వెంటనే పనులు చేపట్టేందుకు 2015లో కాంట్రాక్టు సంస్థకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.100 కోట్లను అడ్వాన్స్‌గా చెల్లించింది. పనులు కొనసాగుతుండగానే మరోసారి బీఆర్ఎస్ సర్కార్ మరో రూ.100 కోట్లను కూడా అడ్వాన్స్‌గా చెల్లించింది. ఇలా ఎప్పటికప్పుడు సవాళ్లను అధిగమించి సర్కార్ పనులను ముందుకు తీసుకెళ్లింది. టీబీఎం సొరంగాన్ని తవ్వే సామర్థ్యం పూర్తిగా తగ్గిపోవడం, కార్మికుల పనిసామర్థ్యం తగ్గిపోవడం, సీపేజీ ఎక్కువ రావడం ఆనాడు సవాళ్లుగా నిలిచాయి. గంటకు 2.5 మీటర్లు బోరింగ్ చేయాల్సిన టీబీఎం సామర్థ్యం రోజుకు గరిష్ఠంగా 5 మీటర్లు కూడా దాటని పరిస్థితి ఏర్పడింది. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ఇన్‌లెట్ టన్నెల్‌లోకి 2018న భారీగా నీరు వచ్చి చేరింది. ఫలితంగా బోరింగ్ పనులు ఆగిపోయాయి. డీవాటరింగ్ సిస్టమ్‌ను మెరుపరచి డిసెంబరు 2019 వరకు నీటిని తొలగించారు. కాంట్రాక్టు ఏజెన్సీకి అప్పటివరకు చెల్లిస్తున్న డీవాటరింగ్ చార్జీలను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే సవరించి పెంచింది. దీంతో డీవాటరింగ్ తర్వాత బోరింగ్ వర్క్ ప్రారంభమైంది.

నాడు ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రత్యేక చొరవ

ఆనాడు కాంట్రాక్టు సంస్థ కరెంటు బిల్లులను సక్రమంగా చెల్లించకపోవడం, టీఎస్ఎస్‌పీడీసీఎల్ విద్యుత్తు సరఫరాను నిలిపివేయడం, ఫలితంగా డీవాటరింగ్ నిలిచి టీబీఎం పాక్షికంగా మునిగి పనులు నిలిచిపోవడం పరిపాటిగా మారింది. దీంతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో కాంట్రాక్టు ఏజెన్సీ చెల్లించే కరెంటు బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తుందని, ఆ బిల్లును ఏజెన్సీకి చెల్లించే బిల్లుల నుంచి మినహాయించుకుంటుందని, కరెంటు సరఫరాను ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించొద్దని టీఎస్ఎస్‌పీడీసీఎల్‌కు స్పష్టమైన ఆదేశాలను జారీచేశారు. దీనికోసం క్యాబినెట్‌లో ఆమోదం కూడా తీసుకున్నారు. ఇది రాష్ట్ర ప్రాజెక్టుల చరిత్రలోనే తొలిసారి కావడం గమనార్హం. విదేశాల నుంచి నిపుణులను రప్పించి టీబీఎంను పునరుద్ధరించి 2023లో ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. అయితే ప్రస్తుతం సొరంగం తవ్వుతున్న ప్రాంతంలో షియర్ జోన్ నుంచి భారీ సీపేజీ రావడాన్ని గుర్తించి నివారణ చర్యలు చేపట్టేవరకూ పనులను నిర్వహించవద్దని నిర్ణయించారు. బీఆర్ఎస్ సర్కార్ హయాంలో అవుట్‌లెట్ పనుల్లోనూ అడ్డంకులను అధిగమించారు.

ఇంజినీర్ల సూచనలు పెడచెవిన పెట్టిన సర్కార్

ఇన్‌లెట్‌లో పనులు చేపట్టడం కత్తిమీది సాములాంటిందని ఇంజినీర్లు చెప్పినా, సర్కారు మాత్రం పెడచెవిన పెట్టిందని విమర్శలున్నాయి. పనులు చేయాల్సిందేనంటూ కాంట్రాక్ట్ సంస్థపై ఒత్తిడి చేస్తూ, మెడమీద కత్తి పెట్టినంత పనిచేసిందని ఇంజినీర్లే చెప్తున్నారు. పటిష్ఠ రక్షణ చర్యలు, గ్రౌటింగ్ నిర్వహించకుండా పనులను ముందుకు తీసుకెళ్లడం వల్లే ప్రస్తుతం మట్టి, సిమెంట్ కప్పులు కూలిపోయాయని తెలిసింది. సర్కారు తొందరపాటు, ప్రచార యావ, ఏజెన్సీ నిర్లక్ష్యం మూలంగానే సొరంగం కూలిందని ఇంజినీరింగ్ నిపుణులు చర్చించుకుంటున్నారు.

సీఎం అబద్ధం

'ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) పనులు కాంగ్రెస్ పాలనలోనే 30 కిలోమీటర్ల మేర పూర్తయింది. మధ్యలో గత పదేండ్ల నుంచి పనులు చేయకపోవడం వల్ల యంత్ర పరికరాలూ పాడయ్యాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తిచేస్తాం' ఇవి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తాజాగా ఢిల్లీలో చేసిన ఆరోపణ.

బీఆర్ఎస్ నిజం

బీఆర్ఎస్ హయాంలో ఎస్ఎల్‌బీసీ పనులు నిర్విఘ్నంగా ముందుకు సాగాయి. మొత్తంగా 43.93 కిలోమీటర్ల టన్నెల్ తవ్వకంలో భాగంగా రాష్ట్ర ఏర్పాటు నాటికి పూర్తయింది కేవలం 22 కిలోమీటర్లే. ఆ తర్వాత గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం 11.48 కిలోమీటర్ల మేర టన్నెల్ నిర్మాణాన్ని పూర్తిచేసింది. తెలంగాణ ఏర్పడే వరకు గత ప్రభుత్వాలు అంటే 2014 జూన్ నాటికి రూ.1,279.04 కోట్లను వెచ్చించాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ సర్కారు తొమ్మిదిన్నరేండ్లలో రూ.1,364.46 కోట్లను ఖర్చుచేసింది.

ఎస్ఎల్‌బీసీ సొరంగం నిర్మాణ వివరాలు (కి.మీ,)

మొత్తం సొరంగం లక్ష్యం	43.93
2014కు ముందు	22.890
2014-2019	11.482
పూర్తయిన మొత్తం	34.372
తవ్వాల్సిన సొరంగం	9.560

దాచేస్తే దాగని సత్యం 'అట్లాస్'

- కేసీఆర్ పాలన వైభవాన్ని తొక్కిపెట్టలేరు
- అధికారులపై వేధింపులు సిగ్గుచేటు
- సర్కార్ చిల్లర చేష్టలు మానుకోవాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేనట్టే పదేండ్ల కేసీఆర్ పాలన వైభవాన్ని తొక్కిపట్టలేరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. చేతకాని పాలనతో తెలంగాణను ఆగం చేసి, వాస్తవాలను బయటపెట్టిన అధికారులపై కక్షకట్టడం సీఎం రేవంత్‌రెడ్డి మూర్ఖత్వానికి నిదర్శనమని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పార్టీ పాలన వైభవాన్ని సీఎం కక్షపెంచుకొని ఆపాలని చూసినా 'అట్లాస్' (తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్) రూపంలోనో, మరో రూపంలోనో బయటికివస్తుందని చెప్పారు. బీఆర్ఎస్ దార్శనిక పాలనకు, దద్దమ్మ కాంగ్రెస్ పాలనకు ఉన్న స్పష్టమైన తేడా, నాలుగు కోట్ల సమాజం ముందు 'అట్లాస్' రూపంలో బట్టబయలు కావడంతో ముఖ్యమంత్రికి మింగుడుపడటం లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో సాధించిన ఘనమైన గతాన్ని తొక్కిపెట్టడం, అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపడం ఎవరికీ సాధ్యం కాదని పేర్కొన్నారు. అధికార యంత్రాంగంపై కూడా వేధింపులకు పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు. తలసరి ఆదాయంలో నంబర్‌వన్‌గా ఉన్న రాష్ట్రాన్ని తలకు మాసిన నిర్ణయాలతో దివాలా తీసేస్థితికి తెచ్చి ఇప్పటికే క్షమించరాని పాపాన్ని ముఖ్యమంత్రి మూటగట్టుకున్నారని మండిపడ్డారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో వ్యవసాయరంగంలో సాధించిన విప్లవం, పారిశ్రామిక రంగంలో పరుగులు పెట్టిన ప్రగతిపథం.. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటుందని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనా సౌరభాలను వైబ్‌సైట్ నుంచి తొలగించినంత మాత్రాన, చేయని తప్పునకు అధికారులపై వేటు వేసినంత మాత్రాన 'పదేండ్ల ముఖచిత్రాన్ని, సువర్ణాక్షరాలతో లిఖించిన స్వర్ణయుగాన్ని చెరిపేయడం ముఖ్యమంత్రి వల్లే కాదు.. ఢిల్లీ పార్టీ ముత్తాతల వల్ల కూడా కాదు' అని తేల్చిచెప్పారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కారు చేస్తున్న చిల్లరచేష్టలు మానుకుంటే మంచిదని చెప్పారు.

నేడు 'టెక్ ఇన్నోవెటివ్ సమ్మిట్'లో కేటీఆర్ ప్రసంగం

'టెక్ ఇన్నోవెటివ్ సమ్మిట్'లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొననున్నారు. బెంగళూరులో గురువారం జరగనున్న ప్రతిష్టాత్మక ఈ సమ్మిట్‌లో 'డ్రైవింగ్ డిజిటల్ ఇండియా ఇన్నోవేషన్స్ స్ట్రాటజీస్ ఫర్ ఏ టెక్నాలజికల్లీ అడ్వాన్స్‌డ్ ఫ్యూచర్' అనే అంశంపై కేటీఆర్ కీలక ప్రసంగం చేయనున్నారు.

మాకు నచ్చినట్టు మార్చేయండి!

మొదటిపేజీ తరువాయి...

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో డైరెక్ట రేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ (డీఈఎస్), తెలంగాణ డెవలప్‌మెంట్ అండ్ ప్లానింగ్ సొసైటీ (టీఎస్‌డీపీఎస్) భాగస్వామ్యంతో 184 పేజీలతో దానిని రూపొందించారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిన దశాబ్ద ప్రగతి, వివిధ రంగాల ప్రగతి డాటా, గ్రాఫిక్స్‌తో కూడిన వివరాలను ఆ నివేదికలో పొందుపర్చారు. వాటిని ఎదుర్కొనే ధైర్యం లేని సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ నివేదికను రూపొందించిన అధికారులపై వేటు వేయడం చర్చనీయాంశంగా మారింది.

తప్పులు దొర్లాయనే సాకుతో వేటు

కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని జీర్ణించుకోలేక అట్లాస్‌లో అక్కడక్కడా కొన్ని అక్షర దోషాలు దొర్లాయనే సాకుతో సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగులపై వేటువేయడం ఎంతవరకు సమంజమని ఉద్యోగ సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. టీఎస్‌డీపీఎస్ డైరెక్టర్ మీరాతోపాటు ఇద్దరు జాయింట్ డైరెక్టర్లను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని, కిందిస్థాయి సిబ్బందిని బదిలీ చేయాలని, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తొలగించాలని సీఎం ఆదేశించడం తగదని అంటున్నారు. నిజాలకు భయపడుతున్న రేవంత్‌రెడ్డి.. అధికారులపై చర్యలకు దిగడం ఆయన చేతగానికితనానికి నిదర్శనమని చెప్తున్నారు. నిజాలను ఎదుర్కొనే సాహసం చేయలేక, అధికారులపైనే ఒత్తిడి తెచ్చే చర్యలు న్యాయమైనవని ప్రశ్నిస్తున్నారు.

కొత్త నివేదిక రూపకల్పనకు ఆదేశాలు?

కేసీఆర్ హయాంలో రాష్ట్రం అన్నిరంగాల్లో ముందుకు సాగిందని అట్లాస్ నివేదిక స్పష్టంచేస్తున్నది. తెలంగాణ అభివృద్ధిని చూసిన ప్రజలు నిజాలను అర్థం చేసుకోవడం ఖాయంగా కనిపిస్తున్నది. అదే నివేదిక ప్రజల్లోకి వెళ్తే త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతికూల ప్రభావం పడుతుందని సీఎం భావించినట్టు సమాచారం. 'మా శాఖ ప్రతి సంవత్సరం విడుదల చేస్తున్న ఎన్నో నివేదికలు ఎంతో మంది యువతకు రిఫరెన్స్‌గా ఉపయోగపడుతున్నాయి. మా నివేదికల గణాంకాల ఆధారంగానే జవాబులు రాసి ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించారు. అలాంటిది మేము రూపొందించిన నివేదికను పూర్తిగా మార్చాలని సీఎం ఆదేశించారు. కొత్తగా మళ్లీ అట్లాస్ రూపొందించాలని ఆదేశాలు వచ్చాయి' అని పేరు చెప్పడానికి ఇష్టపడని టీఎస్‌డీపీఎస్ ఉద్యోగి ఒకరు చెప్పారు.